# బాపూ బొమ్మ

దేశానికి స్వతంత్రం వచ్చిన కొన్ని సంవత్సరాలకి...

బస్సులు తిరుగుతున్నా, దగ్గర దగ్గర ఊళ్ళ మధ్య వ్యవసాయదారుల కుటుంబాలలో ఎడ్లబండి ప్రయాణాలే ఎక్కువగా జరుగుతున్న ఆ రోజుల్లో...

ఆంధ్రరాష్ట్రంలోని ఒకానొక గ్రామంలో...

నట్టింట్లో కూర్చుని బియ్యం బాగుచేస్తున్న అత్తాకోడళ్ళ దృష్టి చేస్తున్న పని మీద లేనే లేదు. మాటిమాటికీ వాళ్లిద్దరి చూపులు తలుపులు బార్లా తెరిచి ఉంచిన వీధి గుమ్మంవేపే తిరుగుతున్నాయి. వీధిలో ఏ ఎడ్లబండి వెళ్తున్న సడి వినిపించినా, ఆదుర్దాగా తలెత్తి చూడటం, తమ ఇంటి ముందు ఆగకపోయేసరికి నిరాశగా నిట్టూర్చడం ...వీళ్లిద్దరూ చేస్తున్న పని అదే!

కాసేపటికే పద్మావతి చేతిలోని చేటను పక్కన పెట్టి స్తంభానికి చేరగిలబడి కూర్చుని అత్తగారితో ''మీ అబ్బాయి ఇంకా రాలేదేమిటో...'' అంటూ నిట్టూర్చింది.

మీనాక్షమ్మా నిట్టూర్చి, ''అదే...నేనూ చూస్తున్నా. మనసు మనసులో లేదు. ఏదో ఆదుర్దా...! చిన్నపిల్ల... తెలియక ఏదైనా పొరపాటు పని చేసినా మంచీ చెడూ విడమరిచి చెప్పుకోవాలిగానీ..'వచ్చి మీ పిల్లకు బుద్ధి చెప్పి వెళ్ళండని' బుల్లెమ్మాయి అత్తగారు మనకు కబురు పెట్టడం విడ్డూరంగానే ఉంది...!'' అంటూ బుగ్గన వేలేసుకుని మరీ విస్తుబోయింది.

“అవును.. ఆవిడ ధోరణి మొదటినుండీ అలాగే ఉంది. మనమే అర్థం చేసుకోలేకపోయామనిపిస్తుంది. పెళ్ళి అయ్యీ అవగానే తన అధికారం చూపించేసింది! పిల్లతోపాటుగా వెళ్దామని ముచ్చటపడిన మేనత్తల్ని 'ఎవరూ రానవసరం లేదని' చెప్పేసింది. 'ఇదేం చోద్యం..' అంటూ ముందు విస్తుపోయి, తర్వాత మొహాలు చిన్నబుచ్చుకున్నారు కూడానూ...'' కళ్ళు తుడుచుకుంది పద్మావతి.

“ఎక్కడా లేని రీతి రివాజులన్నీ బుల్లెమ్మాయి అత్తగారి నోటి వెంటే వింటున్నాం ! పెళ్ళయ్యాక అమ్మాయి అత్తగారింటి పద్ధతులకి అలవాటయి స్థిమితపడి కుదురుకునే వరకూ పుట్టింటికివచ్చి పోతుంటేనే బావుంటుందా.. ఆవిడేమో రాకపోకలు కుదరదంటూ కొత్త రూలు పెట్టింది ! అదేమనటానికి వీల్లేకుండా వాళ్ళింటి ఆనవాయితీ అని తేల్చి చెప్పేసిందాయె! అదేమిటో..కడుపులో ఓ నలుసు పడిందనే కబురు తెలిసాక... అప్పుడు అయిదో...ఏడో నెలలోనో సూడిదలిచ్చి, పుట్టింటికి తీసుకువెళ్లచ్చట ! ఇలాంటి ఆచారాన్ని మనమెప్పుడూ వినలేదు. ఆవిడకు వాళ్లత్తగారు అలా చేసిందట! అందుకని.. ఇపుడు మన పిల్ల మీద ఆ కక్ష చూపిస్తోందేమో....'' అంటూ మీనాక్షమ్మ నిట్టూర్చింది.

“అవును... ఆ కబురెప్పుడు వస్తుందా అని కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూడాలే తప్ప ఏం చేయగలం! పిల్లనిచ్చుకున్నవాళ్లం.ఆ పైన, అటువైపు స్థితిమంతులూ...! వాళ్ళేం చెబితే అది మనం వినాల్సిందే! మనం వెళ్ళి చూస్తేనేమో... పిల్లకి పుట్టింటి మీద బెంగ కలిగి కుదురుగా ఉండలేదట. ఇక్కడకు పంపించటానికేమో... దీపం వెలిగించే కోడల్ని పంపితే మేం చీకట్లో ఉండాలి. పురిటి రోజులకైతే ఏదో అలవాటుచేసుకుంటాం గానీ

అంది ! ముందరికాళ్ళకు బంధాలేస్తున్నట్టుగా ఎంత అందంగా మాట్లాడుతుందో..!

పెళ్లవగానే, ఒడిగంటు బియ్యంతో అత్తగారింటికి వెళ్లిన పిల్ల, మళ్ళీ పుట్టింట్లో కాలుపెట్టనే లేదు ! పదహారు రోజులపండుగా లేదు. మనుగుడుపుల ముచ్చటా... ఏదీ లేదు...!'' పద్మావతి మళ్ళీ కళ్ళు తుడుచుకుంది.

“మీరంతా అంత గొప్పింటి సంబంధం వచ్చిందని మురిసిపోయారుగానీ... నాకెందుకో పెళ్ళిచూపులనాడే ఆవిడ డాబూ, దర్పం ధోరణి చూసేక నాక్కొంచెం అనుమానంగానే ఉంది. మాటల్లో మాత్రమే తేనె కురిపించే రకంలా అనిపించింది... కాకపోతే నాదే అనుమానం ఏమోలే అని సరిపెట్టుకుని వూరుకున్నాను !''

వాళ్లిద్దరూ బుల్లెమ్మాయి కాపురం గురించి ఊహాగానాలతో మల్లగుల్లాలు పడుతూ ఉండగానే... ఇంటిముందు బండి ఆగిన శబ్దానికి ఇద్దరూ ఉలిక్కిపడి అటు చూశారు. తండ్రి వెనకే బండి దిగిన బుల్లెమ్మాయిని చూడగానే అత్తా కోడళ్లిద్దరి కళ్లూ ఆశ్చర్యంతో పత్తికాయలంత అయిపోయాయి!

బుల్లెమ్మాయి రాకని ఊహించకపోవటం వలన ఒక క్షణం నిశ్చేష్టులై నిలబడిపోయిన వాళ్ళు తేరుకుని హడావుడిగా గుమ్మం దగ్గరకు చేరుకున్నారు.

బుల్లెమ్మాయి ఇష్టంగా ఇంటి పరిసరాల్ని నిదానంగా చూసుకుంటూ, అక్కడ పెట్టి ఉన్న దేగిశాలోని నీళ్లను చెంబులో తీసుకుని కాళ్ళు కడుక్కుని మెట్లెక్కి లోపలకు వచ్చింది.

లోపలకు వెళ్ళిపోయిన గోపాలరావును పట్టించుకోకుండా వాళ్లిద్దరూ బుల్లెమ్మాయిని చేతులతో చుట్టేశారు.

“పచ్చి పసుపుకొమ్ములా మిసమిసలాడుతూ ఉండే పిల్ల... ఇలా ఎండు పుల్లలా మారిపోయింది! బెంగ పెట్టుకున్నావా...? తిండి తింటున్నావా అసలు...?''

“ ఏదైనా విశేషం ఉందా...చెప్పి రమ్మని మీ అత్త పంపించిందా..?”

“ అలాంటి కబురే వుంటే...చూసి వెళ్ళండంటుందిగానీ..... బుద్ధి చెప్పమని ఎందుకు వర్తమానం పంపిస్తుందీ... మీది మరీ చోద్యంగా ఉంది...!''

“అవునే అమ్మడూ... ఇంతకీ ఏం జరిగిందీ...?''

అమ్మ, నాన్నమ్మల ప్రశ్నల దాడిని చిరునవ్వుతో చూస్తూ బుల్లెమ్మాయి ''మంచే జరిగింది..!'' అంది.

“అంటే...?''

“ఏం ఉందీ... మనసు కరిగి మనల్ని చూసి రమ్మని పంపించటమే...! అవునా..?''

మళ్ళీ ప్రశ్నలు మొదలుపెట్టారా అన్న అసహనం బుల్లెమ్మాయిలో కనిపించేసరికి ఆత్రాన్ని కొంచెం అణచుకున్నారు.

“ముందు అమ్మాయికి తినటానికి ఏమైనా తీసుకురావే..'' మీనాక్షమ్మ కోడలికి పురమాయించింది.

పద్మావతి వెళ్ళబోతుంటే, బుల్లెమ్మాయి చేయి పట్టుకుని ఆపుతూ ''వద్దమ్మా... దారిలో కమలత్త చూసి

బండి ఆపించి, వాళ్లింటికి తీసుకువెళ్ళి తినటానికి ఏవో చాలా పెట్టింది. నాన్నా, నేనూ బాగానే తిన్నాం. ఆకలి లేదు...!'' అంది.

“అయితే, కూర్చుని కాసేపు మీ అత్తారింటి కబుర్లు చెప్పు... నీ మాటల్ని విని ఎన్నో ఏళ్ళు అయిపోయినట్లుగా ఉంది మరి..!''

మీనాక్షమ్మ మాటలకు పద్మావతి అవునన్నట్లుగా తల వూపుతూ, ''మీ అత్త నిన్ను బాగానే చూసుకుంటుంది కదా...? మాట తీరు, పద్ధతి చూసి నిన్నేమైనా ఆరడి పెడుతోందేమోనని నాకు మనసులో ఒకటే ఆరాటం అనుకో!'' అంది.

బుల్లెమ్మాయి ఫక్కున నవ్వి ''మా అత్తగారు చాలా మంచిది! ఈ మాట నేను కాదు, నాన్నే ఇందాక అన్నారు... తెలుసా?'' అంది.

“నిజమా...?'' ఇద్దరూ ఒక్కసారే అన్నారు.

“అయితే మేమే పొరబడ్డామన్నమాట! ఇపుడు కూడా ఆవిడ గురించి ఏమేమో అనుకున్నాం...!''

“ఏవేవో ఆంక్షలు పెట్టిందని...కొంచెం గయ్యాళితనమేమో అనుకున్నాం. మాట పెళుసుగానీ, మనసు వెన్న అంటారు... అలాంటి రకం కాబోలు! అర్థం చేసుకోలేకపోయాం. !''

''అయినా, అత్తగారిదేం ఉందిలే, ఆవిడ పెత్తనం ఎన్నాళ్లు సాగుతుందేం? అబ్బాయి నిను ప్రేమగా చూసుకుంటే చాలు. మంచివాడేగా...?''

“అదేమిటే, మేం ఇద్దరం ఇన్ని ప్రశ్నలడుగుతుంటే ఏం మాట్లాడకుండా అలా చూస్తావేం...?''

“ఏం చెప్పాలో తెలియక, మీ మాటలు వింటున్నాను..!'' అంటూ నిట్టూర్చింది. ఇద్దరి మధ్యలో కూర్చున్న బుల్లెమ్మాయి లేచి వెళ్ళి తనతోపాటు తీసుకువచ్చిన చేతిసంచీ నుండి ఒక నోట్‌బుక్‌ను తీసుకువచ్చి అందించింది.

''నేను అత్తారింటికి వెళ్ళే రోజున బాబాయ్ ఇది ఇచ్చి 'నేను వచ్చినప్పుడల్లా నీ ఆలోచనల్ని చక్కగా కథల్లా చెబుతూంటావుగా! అక్కడ కొత్త వలన ఎవరితోనూ చెప్పుకోకపోవచ్చు. అలాంటప్పుడు అవన్నీ కాగితాల మీద పెట్టడం వలన మంచి ప్రయోజనం ఉంటుంది. కథలు రాయగలిగే నేర్పు అలవడుతుంది..!' అని చెప్పాడు. మీరెవరూ అక్కడికి రావటానికీ లేదు,నేనూ రాలేను... ఉత్తరాలు రాసే వీలు అసలే లేదు. అందుకని... నాలో నేను అనుకుంటున్నవీ, మీతో మాట్లాడాలనుకుంటున్నవీ అప్పుడప్పుడూ బాబాయ్ ఇచ్చిన ఈ పుస్తకంలో రాస్తూండేదానిని ! మా అత్తకి చదవటం రాదు, ఆయనగారికి అంత తీరిక, ఓపిక లేదు కాబట్టి... ఇది పదిలంగా నా దగ్గర మిగిలి ఉందన్నమాట! నేను కాసేపు నా గదిలో కాలక్షేపం చేస్తాను. మీ ఇద్దరికీ చదవటం వచ్చును కాబట్టి పక్క పక్కనే కూర్చుని చదువుకోండి. ఇక నేను చెప్పాల్సింది చివరలో చెబుతాలే...!''

అయోమయంగా చూస్తున్న అమ్మ, నాన్నమ్మల వేపు చిరునవ్వుతో చూసి బుల్లెమ్మాయి తన గదివేపుకి వెళ్ళిపోయింది.

మీనాక్షమ్మ నిట్టూర్చింది ''అమ్మలు అత్తవారింటి నుండి కబురు తెచ్చినవాడు కొంచెం అయోమయం

రకం అయివుంటాడు. అబ్బాయిని వచ్చి వెళ్ళమని వాళ్ళు చెప్పి పంపితే, వీడు ఇంకోలా చెప్పి మనల్ని కంగారు పెట్టాడు. అబ్బాయికి అసలే కోపం ఎక్కువ, అక్కడ ఏం జరిగిందో, ఎలా మాట్లాడతాడోనని మనసులోనే ఎంత గుంజాటన పడ్డానో..!''

“అవును... నేనూ అంతే... ! ఏం జరిగిందో, పిల్ల కాపురానికి ఎలాంటి ముప్పు వస్తుందోనని ఎంత బెంగపడ్డానో! అయినా మామూలుగానే ఉన్నారు... అమ్మాయీ నవ్వు మొహంతోనే ఉంది. కాబట్టి ఉపద్రవం ఏం లేదు! అనవసరంగా మనమే బెంబేలు పడ్డాం!'' అంది పద్మావతి తేలికపడిన మనసుతో.

“సరే... సరే... ముందు ఇది చదువుదాం...'' అంటూ మీనాక్షమ్మ ఆ పుస్తకం తెరిచి పట్టుకుంది. ఇద్దరి చూపులూ అక్షరాల వెంట పరుగుపెట్టాయ్!

★ ★ ★

అత్తగారింట్లో అడుగుపెట్టాక, చుట్టపక్కాలందరూ వెళ్ళిపోయి సావకాశంగా ఉన్నపుడు మా అత్తగారు ఏమన్నదో తెలుసా...?

''లంకంత కొంప... మీ ఇల్లులా ఇరుకు కాదు. తిరిగి చూడు... అన్నీ బర్మా నుంచి తెప్పించిన టేకుతో చేసినవి! మంచాలూ... కుర్చీలూ అన్నీను... ఏదీ చవకబారు చెక్కతో చేసినవి కావు! నాకన్నీ నాణ్యమైనవి కావాలి! ఎక్కడా రాజీపడను! నీ ఒక్కదాని విషయంలోనే కట్నకానుకలేమీ లేకపోయినా సర్దుకున్నాను! పెట్టి పుట్టటమంటారు చూడూ.... ఇపుడు నిన్ను చూస్తుంటే, అర్థం తెలుస్తోంది. లేకపోతే ఏమిటీ ..ఇంతటి సిరిసంపదలున్న ఇంటికి కానీ కట్నం తేకుండా కోడలివైపోయావు గదా!'' నవ్వు మొహంతోనే నిట్టూర్చింది.

నేను అయోమయంగా చూస్తుంటే, ఏమిటో... నువ్వుత్త వెర్రిబాగులదానిలా ఉన్నావ్! నీకెంత అదృష్టం పట్టిందో నీకర్థం అయినట్లు లేదు! ఏడాది తిరిగే సరికల్లా పదిపుట్ల ధాన్యం ఇంటికొస్తుంది! పది గేదెల పాడి ఉంది! దేనికీ లోటు లేని సంసారం! ఆస్తిపాస్తుల్ని పంచుకునే అన్నదమ్ములూ లేరు. ఒక్కడే వారసుడు!'' అంటూ నావేపు కోపంగా మిర్రిమిర్రి చూసింది.

నా అదృష్టానికి నేను ఆనందంతో ఉబ్బితబ్బిబ్బు అయిపోతున్నట్లుగా కనుపించకపోవటమే ఆ కోపానికి కారణం అయివుంటుందేమో!

వాళ్ళింటి గురించి లంకంత కొంప అని చెప్పుకోవటం వరకూ ఫర్వాలేదు గాని మీ ఇల్లులా ఇరుకు కాదు అని పోల్చి చెప్పటమే నాకు నచ్చలేదు.

ఒక పెద్ద భోషాణాన్నీ, ఇనప్పెట్టినీ చూపించి అవి మా పుట్టింటినుండి తెచ్చుకున్నవని అత్త ఎంత మురిపెంగా చెప్పారో! ఆ భోషాణంలో క్రింద వెండి బిందెలాంటి విలువైన వస్తువులు ఉన్నాయట! పైన ఏవో పాత వస్తువులు పడేసి ఎవరికీ ఆ విషయం తెలియకుండా కాపాడుతున్నానని రహస్యంలా స్వరం తగ్గించి గుసగుసలా చెప్పింది.

ఇనప్పెట్టిలో తనవి ఏడువారాల నగలున్నాయనీ, అక్కడెవరూ లేకపోయినా అదే రహస్యం చెబుతున్న గొంతుతో మళ్ళీ చెప్పారు. ఆవిడను సంతోషపెట్టటానికైనా నా కళ్ళలో మిలమిలలు తెప్పించి ఆనందం చూపించాలని ప్రయత్నించానుగానీ, వీలుకాలేదు.

అందుకే కాబోలు నావేపు కొంచెం వెటకారంగా చూస్తూ నిట్టూర్చి వూరుకున్నారు. నిజమే, ఇక్కడున్నట్లు మేలుజాతి టేకు కర్రతో చేసిన పెద్దపెద్ద పందిరి మంచాలు, నగిషీలతో ఉన్న బల్లలూ, కుర్చీలూ లాంటివేం మా ఇంట్లో లేవు. మామూలు నవారు మంచాలు, కుర్చీలూ... అంతే! భోషాణాలూ, బీరువాలు లాంటివి ఏం లేకపోతే మాత్రమేం మా ఇల్లు నాకెంతో అందంగా అనిపించేది!

నా చిన్నగదిలో చిన్న కిటికీ పక్కనున్న మంచం మీద పడుకుని బయటకు చూడటం ఎంత బావుండేదో..! అక్కడే గోడవారగా ఉన్న మల్లెపందిరి తన పూల పరిమళాల్ని గాలితో కలగలిపి నాకు జోలపాడమని చెప్పి పంపిస్తూండేది! ఎదురుగా కనుపించే కొబ్బరిచెట్టు ఆకులమధ్య దోబూచులాడుతున్నట్లుండే చందమామతో నా అల్లీబిల్లీ ఆలోచనల్ని చెప్పుకుంటూ నిద్రలోకి జారిపోవటం... ఎంత ఆనందమో...! అపుడు ఇలాంటివన్నీ ఇష్టంగానే ఉన్నా... ఇక్కడికి వచ్చాక మాత్రం... మా ఊళ్ళో గడిపిన రోజులన్నీ ఎంత ఆహ్లాదకరమో, ఇప్పుడే బాగా అర్థమౌతోంది.

ఇక్కడకు వచ్చే రోజున అమ్మ, నాన్న నన్ను కూర్చోబెట్టి చెప్పిన మాటలు అప్రయత్నంగా గుర్తుకు వచ్చాయి.

“చూడు అమ్మలూ... నువ్వు మీ అత్తగారింటికి వెళ్తున్నావు. అది నీకు పూర్తిగా కొత్తచోటు. ఆ పరిసరాలూ, మనుషులూ అన్నీ కొత్తే. నీకు నచ్చనివి ఎన్నో ఉండొచ్చు. నాది అనుకుని ఇష్టం పెంచుకునే ప్రయత్నం చేయాలి. ఇక్కడే పుట్టి పెరిగావు కాబట్టి అందరితో నీకు అనుబంధం సహజంగానే ఏర్పడుతుంది. ఎక్కడైనా మనకు నచ్చని విషయాలు కొన్ని ఉండనే ఉంటాయి. ఇక్కడైతే, నీకు నచ్చనిదాన్ని నిస్సంకోచంగా చెప్పగలుగుతావు. కావాల్సినది స్వతంత్రంగా అడుగుతావు. అక్కడా అలాంటి పరిస్థితి ఏర్పడటానికి కొంత సమయం పడుతుంది. వాళ్ళ పద్ధతులకీ, అలవాట్లకీ కొంచెం అలవాటుపడి సర్దుకుపోవటం తప్పనిసరి అవుతుంది! ముందుగా వాళ్ళతో కలిసిపోయే ప్రయత్నం చేయి. వాళ్ళూ నీవాళ్ళేనని అనుకోవటంతో కొన్ని సమస్యలు అవే సర్దుమణుగుతాయి. కనిపెంచిన వాళ్ళమధ్య జరిగినట్లుగా అత్తవారింట్లో ఉండకపోవచ్చు. ఒక వయసు వచ్చాక అత్తగారింట్లో అడుగుపెడుతున్నావు కాబట్టి నువ్వే పెద్దరికం తెచ్చుకుని సమస్యలేమైనా వస్తే సామరస్యంగా పరిష్కరించుకునే మార్గం వెతుక్కోవాలి!’’

నాన్న మాటలు పూర్తికాగానే అమ్మా అందుకొంది.

‘‘అమ్మాయ్ నువ్వేం బెంగపడకు. మీ అత్తగారి మాటలు వింటోంటే... నీకక్కడ రాణీ వైభోగమే అనిపిస్తోంది. నీ అదృష్టంకొద్దీ పాడీపంటా అన్నీ పుష్కలంగా ఉన్న ఇంటికి వెళ్తున్నావు! నీకు ఏలోటూ ఉండదు. ఏరికోరి చేసుకుంటున్న కోడల్ని మురిపెంగానే చూసుకుంటుందిలే మీ అత్తగారు ! కాకపోతే ఇక్కడలా నువ్వు కాదు, కూడదు అనకుండా మీ అత్తగారు ఏం చెప్పినా వినయంగా విని అలాగే చేయాలి మరి! లేకపోతే మాకు మాట వస్తుంది!’’ చిన్నగా నవ్వుతూనే కళ్ళు తుడుచుకుంది.

ఈ మాటలు గుర్తుకు రాగానే నా మనసుకు నేనే సర్దిచెప్పుకున్నాను. అవును నిజమే, నా కిష్టం లేకపోతేనేం, ఇంటినిండా ఉన్న సామాన్లు అన్నిటినీ అత్త ఎంత జాగ్రత్తగా, ఇష్టంగా కాపాడుకొస్తున్నారో, నేనూ అదే చేయాలి. మా ఇద్దరి ఇష్టాలూ వేర్వేరు అయితేనేం, పెద్దావిడను అనుకరించి నడవాలి గదా!

అందుకే వీటినన్నింటినీ దుమ్ము దులిపి శుభ్రం చేసే పని పెట్టుకున్నాను. మా అత్తగారు వచ్చి

''దుమ్ము దులపటం వరకేగానీ, సామాన్లని అటూ ఇటూ మార్చి సర్దే పెత్తనం మాత్రం చేయకు'' అంటూ హెచ్చరించింది. 'ఆ భోషాణాల్నీ, బీరువాల్నీ సర్దాలనే సరదా నాకు లేదు గాక లేదు' అనుకుంటూ బాధ్యతగా మాత్రమే ఆ పని పూర్తి చేసాను!

★★★★★★★★★★★★★★

నా ఇష్టాయిష్టాలను పక్కనపెట్టి మా అత్తగారి అభిరుచులు తెలుసుకోవాలనుకున్నా. వీధి గుమ్మంలో నిలబడి పక్కింటివైపు చూస్తూ వాళ్ళమ్మాయి గురించి కాబోలు 'చిన్నికి ఏ పనిపాటలూ రావనుకున్నా, అబ్బో వాకిలి ముందు ముగ్గు బాగానే వేసిందే...' అత్తగారు అనటం విన్నాను. నాకూ ముగ్గులు వేయటం వచ్చు కాబట్టి అత్తగార్ని మెప్పించాలని పెద్దముగ్గు వేయాలని నిర్ణయించుకున్నాను.

చీకట్నే లేచి.. ముందుగానే ఏవి ఎక్కడెక్కడ ఉంటాయో చూసుకుని ఉన్నాను కనుక, ఇంటిముందు కళ్ళాపి జల్లి నాకు వచ్చిన ముప్పైఆరు చుక్కల ముగ్గు చకచకా వేసేశాను. అత్త నిద్ర లేచి వచ్చాక ఇంత పెద్ద ముగ్గును చూసి ఎంత ఆశ్చర్యపోతుందో అని ఆలోచనలు చేస్తూ, అటూ ఇటూ తిరిగి సరిచూసుకుంటూ... నాకిష్టమైన కీర్తనని సన్నగా రాగం తీస్తూ నా లోకంలో నేనున్నా!

అప్పుడు ఉరుములాంటి అత్తగారి గర్జనకు ఉలిక్కిపడి బయట లోకంలోకి వచ్చిపడ్డాను.

''రత్తాలు వచ్చి ఏవో రెండు గీతలు గీస్తుందిగా, ఇంతలో నువ్వెందుకూ ఇంత ముగ్గు పిండిని దుబారా చేయటం? దేనికైనా ఒద్దిక, ముందూ వెనకా ఆలోచనా ఉండాలి! ఏ పండగ, పబ్బమూ లేనపుడు ఏ పనీ లేనట్లుగా ముగ్గేసుకుంటూ కూర్చున్నావా? వీధిన పోయేవాళ్ళు చూసేట్లుగా కూనిరాగాలూ, సానివేషాలూ... అలాంటి అలగా పనులు ఇక్కడ కుదరవ్...!నువ్విపుడు పెద్దింటి కోడలివని గుర్తుపెట్టుకో...!''

నిర్ఘాంతపోయి కళ్ళప్పగించి చూస్తూ నిలబడిపోయాను!

''మాట అర్థం కానట్లుగా ఏమిటా చూపు...? ముందు లోపలికి నడు...!''

ఆ హూంకరింపుకి తలవొంచుకుని సిగ్గుతో చితికిపోయినట్లుగా లోపలకు వెళ్ళిపోయా. ఆ మాటలు పదేపదే మనసును సూదుల్లా గుచ్చుతుంటే లోలోపల విలవిల్లాడిపోవటం తప్ప ఏం చేయగలనూ...!

నేను మొహం చిన్నబుచ్చుకుని తిరుగుతుంటే, మా అత్తకి విజయగర్వంతో కూడిన ఆనందమేదో కలుగుతుందనిపించింది. అది నా అనుమానమే అయివుండొచ్చు కూడా. కాసేపటి తర్వాత నేను బాధపడుతున్నట్లుగా గ్రహించి కొంచెం ఓదార్పుగా మాట్లాడటం కాకుండా, నా మనసులో మంటను ఇంకొంచెం ఎగదోసేలా '' నేను మా అత్తలా కాకుండా మెత్తనిదాన్ని కాబట్టి నువ్వు బ్రతికిపోయావ్! అదే మా అత్త అయితే నెత్తిమీద నాలుగు మొట్టిగానీ, మాట్లాడేది కాదు! ఆవిడ వేపు తలెత్తి చూడటానికే గజగజ వణికిపోయేదాన్ని! పైగా నేనేం నీలా వట్టి చేతుల్తో వచ్చిన దాన్ని కాదు కూడా! పొలంపుట్రా, నగానట్రా, సారె చీరలతో వచ్చాను! అయినాసరే అత్తగారికి అణగిమణగి ఉండేదాన్ని! నా మంచితనాన్ని అలుసుగా తీసుకుని నువ్వు చూడు...నేనేదో కాని మాటలన్నట్లుగా కళ్ళుపెద్దవి చేసుకుని మరీ చోద్యంలా చూస్తున్నావ్! లేకపోతే ఏమిటీ... రోడ్డు మీద నిలబడి కచేరీ చేస్తున్నట్లుగా ఆ పాటలు ఏమిటీ.. వయ్యారం ఒలకబోస్తూ అటూ ఇటూ తిరగటం ఏమిటీ.. హవ్వ...! మా పరువు బజారున పడెయ్యాలని కంకణం కట్టుకున్నావా

ఏమిటీ..!'' అంది. నేను మళ్లీ నిర్ఘాంతపోతూ ఆవిడవేపు చూడబోయి చప్పున తలదించేసుకున్నాను. అదే మా అత్తకి కావలిసిందయితే, అలాగే చేస్తా... అనుకున్నా. పోల్చుకోకూడదని అనుకున్నా సరే, మాటిమాటికీ మా ఇంటి పరిస్థితులే గుర్తుకువస్తున్నాయి. అక్కడ... ఇష్టంగా నేను ముగ్గువేస్తే, ఇంట్లో వాళ్ళు ఎవరైనాగానీ ముగ్గుపిండి దండగ చేసేవని అని వుంటే... అలిగి ఏం తినకుండా కూర్చునేదాన్నే కదూ! 'ఏదో మాట వరసకి అన్నాంగానీ, దీనికే కోపం తెచ్చుకుంటే ఎలాగమ్మా... నువ్వేదీ తినకుండా కూర్చుంటే... మేంమాత్రం ఎలా తినగలం చెప్పూ..' అంటూ బతిమాలితేగానీ బెట్టు వదిలించుకునేదాన్ని కాదు!

కానీ.. ఇపుడో.. ముగ్గుపిండి దండగ చేయటం అనే ఒక్కమాటే కాదు... ఆ తర్వాతి మాటల్ని తలచుకుంటేనే జుగుప్సగా ఉంటోంది! అమ్మా నాన్న చెప్పిన సుద్దుల్ని గుర్తుకు తెచ్చుకుని... ఈ ఊరి రీతి రివాజుల్నిబట్టి మా అత్త అలా మాట్లాడటంలో తప్పేమీ ఉండకపోవచ్చును. 'నేనే కొత్త పద్ధతులకి అలవాటు పడాలి' అని నా మనసుకు సర్ది చెప్పుకున్నాను.

ఇక ఎప్పుడూ ఇంట్లో అయినా కూనిరాగాలు తీయకూడదని నిర్ణయించుకున్నాను.

మా ఊరి హైస్కూలులో వారానికి రెండుగంటలు సంగీతం క్లాసులు జరుగుతుండేవి. మా సంగీతం టీచరు ఎన్నో లలితగీతాలు, కీర్తనలూ నేర్పించేవారు.

ఎపుడైనా ఇంట్లో పాటని నాలో నేను సాధన చేసుకుంటుంటే, అమ్మ, నానమ్మ చేసే పనిని కూడా పక్కన పెట్టేసి నా దగ్గరకు వచ్చి కూర్చుని 'ఇంకోటి కూడా పాడవే...' అని అడిగేవాళ్ళు.

అలా అడగటమే ఆనందంగా, ఎలాంటి సంకోచం లేకుండా పెద్ద గొంతుతో ఇష్టంగా పాడటం మొదలుపెట్టగానే పక్కనే ఉండే పెదనాన్నల పిల్లలు, ఒక్కోసారి పెద్దమ్మలు కూడా వచ్చి చేరటం అలవాటుగా ఉండేది.

'నీ పాట చెవిన బడగానే ఇంట్లో ఉండలేక వచ్చేసా, నీ కంఠం ఎంత బావుంటుందో...! అని ఓ సారి పూర్ణక్క అనగానే నాన్నమ్మ 'అవును.. చక్కగా పాడగలిగితే, మనసును పరవశింపచేసే శక్తి సంగీతానికి ఉంటుంది.!' అంటూ తన వేపు ఎంత మురిపెంగా చూసేది. ఇక ఆ అధ్యాయం ముగిసిపోయింది.!

తనేం చేసినా మెచ్చుకుని ప్రోత్సహించేవాళ్ళు ఇక్కడ ఉండరు! ఇకనుండీ విమర్శల్ని మాత్రమే ఎదుర్కోవలసి వస్తుందని అర్థమైంది! అదీ నా మంచికే, నా నడవడిని అందరికీ ఆమోదయోగ్యంగా మార్చుకోవటానికి ఉపయోగపడుతుందేమో...!

ఇలా అనుకోగానే మనసు కొంచెం కుదుటపడింది.

పొద్దుటినుండీ ఏమీ తినకుండా ఉన్న నేను మధ్యాహ్నం రెండుగంటల వేళ మా అత్త 'ఇక నువ్వు కానియ్యి...' అని ఆజ్ఞలా చెప్పగానే బుద్ధిగా వెళ్ళి పళ్లెంలో అన్నం, కూరలూ వడ్డించుకుని పీట వేసుకుని కూర్చున్నాను.

★ ★ ★